నా పాలన అద్భుతం!

- నా మంత్రులు బాగా పని చేస్తున్నారు
- కులగణనపై ప్రధానితో చర్చించలేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని అనుకుంటున్నాం
- మంత్రివర్గ విస్తరణ గురించి నేను ఎప్పుడూ ఏమీ చెప్పలేదు
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): తన పరిపాలన అద్భుతంగా ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తన మంత్రులంతా సమర్థంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రధానమంత్రితో భేటీలో కులగణనపై చర్చ జరగలేదని వెల్లడించారు. వాస్తవానికి రాష్ట్రంలో కులగణన చేసి.. అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా.. చివరికి కేంద్ర ప్రభుత్వమే దీన్ని ఆమోదించాల్సి ఉంటుంది. ఇలాంటి కీలక అంశాన్ని ప్రధానితో భేటీ సమయంలో ప్రస్తావించకపోవడం ఏమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం గతం కన్నా బాగుందని ముఖ్యమంత్రి చెప్పారు. మిగతా రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ రాష్ట్రమే బెటర్‌గా ఉన్నదని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ఆయన నమ్మకం వ్యక్తం చేయలేదు. ఆ ఎన్నికల్లో గెలుస్తామనే అనుకుంటున్నాం అని అన్నారు. పీసీసీ కమిటీల ఏర్పాటుకు సంబంధించిన ప్రశ్నకు పీసీసీ అధ్యక్షుడినే అడగాలంటూ సమాధానం దాటవేశారు. ఇక మంత్రివర్గ విస్తరణపై స్పందిస్తూ.. తాను ఎప్పుడు కూడా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెప్పలేదని అన్నారు. కొడంగల్ వ్యవహారాలు తన సోదరుడు చూసుకుంటాడని, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు ఆయనను నియమించానని తెలిపారు. ఇక ప్రధానమంత్రికి తాను ఇవ్వాల్సిన విజ్ఞప్తులు ఇచ్చానని, వాటిని సాధించుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదేనని అన్నారు. ఇక ప్రధాన మంత్రికి తాను ఐదు ప్రాజెక్టులకు సంబంధించి వినతిపత్రం ఇవ్వగా.. ప్రధాని కూడా తనకు ఇక వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర పథకాలకు రాష్ట్రం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్స్(నిధులు)ను విడుదల చేయాలని సూచించినట్టు గోష్ఠిగా మాట్లాడారు. ప్రధానమంత్రితో ఏర్పాటుకు సంబంధించిన ప్రశ్నకు పీసీసీ పేర్కొన్నారు.

రేవంత్‌ను నమ్మని ఏఐసీసీ!

- మోదీని కలిసే ప్రతిసారీ తోడుగా ఓ నేత
- గతంలో భట్టి, ఈసారి శ్రీధర్‌బాబును పంపిన అధిష్ఠానం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిని ఏఐసీసీ పెద్దలు నమ్మడం లేదా? రాహుల్ టీమ్ ముఖ్యమంత్రిపై డేగకన్ను వేసిందా? అందుకే ప్రధాని మోదీని కలిసే ప్రతి సందర్భంలో కాంగ్రెస్ పార్టీకి నమ్మకస్తుడైన ఓ ముఖ్య నేతను హై కమాండ్ ఆయన వెంట పంపుతున్నదా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి గత 15 నెలల్లో ప్రధాని మోదీని మూడు సార్లు కలిశారు. అయితే గతంలో రెండు సార్లు ఆయన వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నారు. అప్పట్లో ఖమ్మంలో అధికారిక పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమైన భట్టిని కాంగ్రెస్ హైకమాండ్ హుటాహుటిన ఢిల్లీకి పిలిపించి సీఎం రేవంత్‌రెడ్డి వెంట ప్రధానితో భేటీకి పంపింది. తాజాగా కాంగ్రెస్ పార్టీకి ముందు నుంచి నమ్మకస్తుడిగా పేరున్న మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యమంత్రి వెంట ఉన్నారు. రేవంత్‌రెడ్డి సొంత నిర్ణయాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారుతున్నదని భావించి ఆయనపై రాహుల్ గాంధీ కోపంగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసిన సందర్భంలో లేదా ఆయన విదేశీ పర్యటనల్లో కచ్చితంగా ఓ నేతను వెంట పంపుతున్నారని తెలుస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఎజెండాతో ముందుకెళ్తే పార్టీకి మరింత నష్టం జరుగుతుందని భావించి కాంగ్రెస్ అధిష్ఠానం ఈ మేరకు ముందుజాగ్రత్తలు తీసుకున్నట్టు సమాచారం. ఆయా సందర్భాల్లో రేవంత్ కదలికలపై సైతం హై కమాండ్ దృష్టి సారించినట్టు తెలిసింది. ఢిల్లీ, విదేశీ పర్యటనల్లో రేవంత్‌రెడ్డి ఎవరిని కలుస్తున్నారు, ఏం చర్చిస్తున్నారు అనే విషయాలపై హైకమాండ్ ప్రత్యేకంగా ఆరా తీస్తున్నట్టు సమాచారం.

నేలకరిచిన రియల్టీ!

మొదటిపేజీ తరువాయి...

వ్యవసాయేతర భూముల (ప్లాట్ల) అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. ఫలితంగా రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం గతంలో కన్నా మెరుగ్గానే ఉన్నదని చెప్తున్నారు. సీఎం చెప్తున్నది పూర్తి అబద్ధం అనడానికి రాష్ట్ర ప్రభుత్వం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజాగా సమర్పించిన నివేదికనే నిదర్శనం. కేసీఆర్ పాలనలో గడిచిన పదేండ్లలో కొవిడ్ కాలం మినహా ఏనాడూ రియల్ రాబడి తగ్గలేదు. పైగా క్రమంగా పెరిగింది. పదేండ్లలో తొలిసారి జనవరి నెలలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం సగానికి పడిపోయింది. ఆదాయం రూ.5,821 కోట్లు మాత్రమే వచ్చింది.

కేసీఆర్ హయాంలో రియల్‌బూమ్

గడిచిన పదేండ్లలో రియల్ ఎస్టేట్ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ, గృహ నిర్మాణ రంగాలకు సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. 2014 తర్వాత రియల్ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. గతంలో రూ.10 లక్షలకు ఎకరం పలికిన భూమి ధర రూ.కోటి వరకు వెళ్లింది. గ్రామ, మండల కేంద్రాల్లో రూ.2000కు గజం స్థలం ఉండగా, ప్రస్తుతం రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెరిగింది. బీఆర్ఎస్ పాలన ప్రారంభమైన తొలి ఏడాది జనవరి నెలలో రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1,697.64 కోట్లు ఉంగా, మరుసటి ఏడాది రూ.2,474.97 కోట్లు, 2016-17లో రూ.2,921.38 కోట్లు, 2017-18లో రూ.3,331.83 కోట్లు, 2018-19లో రూ.4,574.64 కోట్లు, 2019-20లో రూ.5,420.81 కోట్లు వచ్చింది. 2020-21 కొవిడ్ మహమ్మారి కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. అనేక రంగాలు కుదుపునకు లోనయ్యాయి. పలు రంగాలు దెబ్బతిన్నాయి. ఆ ఒక్క ఏడాది మాత్రమే తెలంగాణలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గి రూ.3,358.51 కోట్లకే పరిమితమైంది. ఆ తర్వాతి సంవత్సరాల్లో రెట్టింపు వేగంగా 2021-22లో రూ.9,637.69 కోట్లు, 2022-23లో రూ.11,806.61 కోట్లు రియల్ రాబడి వచ్చింది.

కాంగ్రెస్ పాలనలో దిగజారిన రియల్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక స్థిరాస్తి వ్యాపారం దిగజారిపోయింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెలకే ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. అప్పటివరకు పెరుగుతూ వచ్చిన స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం ఒక్కసారిగా మందగించింది. హైడ్రా ద్వారా ఆక్రమణల పేరుతో భవనాల కూల్చివేతలు, వ్యవసాయ ప్రోత్సాహకాలకు కోత విధించడంతో భూముల కొనుగోళ్లు, అమ్మకాలపై ప్రభావం పడింది. ప్రస్తుత పరిస్థితుల్లో భూములు, ప్లాట్లు అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో రియల్ ఎస్టేట్ ఢామ్ అన్నది. పదేండ్ల క్రితం వరకు కేసీఆర్ పాలనలో ప్రతినెల స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం సుమారు రూ.12 వేల కోట్లు ఉండగా, ఇప్పుడు అది సగానికి పడిపోయింది. ఈ ఏడాది జనవరి నెలలో రూ.5,821.88 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కాగ్‌కు సమర్పించిన నెలవారీ నివేదిక స్పష్టంచేసింది. బీఆర్ఎస్ పాలన ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడంతో ప్రభుత్వ ఖజానాకు ఏడాదిన్నర నుంచి అంతంతగానే ఆదాయం సమకూరుతున్నది.

బీఆర్ఎస్ పాలనలో జనవరి నెలలో రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది ఇలా..

2014-15	రూ.1,697.64 కోట్లు
2015-16	రూ.2,474.97 కోట్లు
2016-17	రూ.2,921.38 కోట్లు
2017-18	రూ.3,331.83 కోట్లు
2018-19	రూ.4,574.64 కోట్లు
2019-20	రూ.5,420.81 కోట్లు
2020-21	రూ.3,358.51 (కొవిడ్ కాలం)
2021-22	రూ.9,637.69 కోట్లు
2022-23	రూ.11,806.61 కోట్లు
డిసెంబర్ 7న	కాంగ్రెస్ సర్కారు వచ్చింది.
2023-24	రూ.11,698.55 కోట్లు
2024-25	రూ.5,821.88 కోట్లు

సీన్ రివర్స్.. ఉల్టా క్లాస్!

మొదటిపేజీ తరువాయి...

రివర్స్‌నోట్.. ఇదే తొలిసారేమో!

ప్రధానికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఒక ముఖ్యమంత్రికి ప్రధానమంత్రి రివర్స్ నోట్ ఇవ్వడం ఇటు రాష్ట్ర రాజకీయాల్లో, అటు దేశ రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ విధంగా ఒక సీఎంకు ప్రధాని రివర్స్‌నోట్ ఇవ్వడం ఇదే తొలిసారేమోనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి ఘటనను తామెప్పుడూ చూడలేదని అంటున్నారు. పీఎంను కలిసేందుకు సీఎం వెళ్లినప్పుడు లేదా రాష్ట్రానికి ప్రధానమంత్రి వచ్చినప్పుడు సదరు సీఎంలకు అనుమతుల మంజూరు పత్రాలు, లేదా నిధుల విడుదల పత్రాలను అందిస్తుంటారు. కానీ, ఇక్కడ కేంద్రం తరుపున తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఒక సీఎంను ప్రధాని నేరుగా కోరడం, ఏకంగా నోట్ ఇవ్వడం సంచలనంగా మారింది. ప్రధాని ఈవిధంగా వ్యవహరించడం వెనుక అంతర్ధం ఏమిటనేదానిపై చర్చ జరుగుతున్నది. రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా కేంద్రాన్ని బద్నాం చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు మోదీ ఈ వ్యూహం పన్నినట్టు చర్చించుకుంటున్నారు.

పోలీసులది ఓ మాట.. ముఖ్యమంత్రిది మరో మాట

- సంజీవరెడ్డి, రాజలింగం, కేదార్ మరణాలపై సీఎం రాజకీయం
- కేటీఆర్‌ను బద్నాం చేసే కుట్రలు
- మరణాలపై అనుమానాలు ఉన్నాయంటూ వ్యాఖ్యానాలు
- పోలీసులు నిజాలు తేల్చినా రేవంత్ అనుమానం ఎవరిపై?
- రాజకీయవర్గాల్లో కీలక చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ): కేటీఆర్, కేసీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్‌పై బట్టకాల్చి మీదేయడమే పనిగా పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి మరో నాటకానికి తెరతీశారు. ఇటీవల పలువురు మరణించడాన్ని మాజీ మంత్రి కేటీఆర్‌కు అంటగట్టే కుట్రకు తెరలేపారు. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో కీలక వ్యాఖ్యలు చేశారు. లాయర్ సంజీవరెడ్డి, రాజలింగమూర్తి, నిర్మాత కేదార్ మరణాలపై అనుమానం ఉన్నదని అన్నారు. వరుసగా సంభవిస్తున్న మరణాలు అనుమానం కలిగిస్తున్నాయని చెప్పారు. దీన్ని కేటీఆర్‌కు ఆపాదించేలా ఆయన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎవరో మరణిస్తే.. కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించడం అనుమానాలకు తావిస్తున్నది. వాస్తవానికి లాయర్ సంజీవరెడ్డి ఆరు నెలల క్రితం మరణించారు. ఆయన గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు, పోలీసులు నిర్ధారించారు. ఆ తర్వాత భూపాలపల్లిలో రాజలింగమూర్తి అనే సామాజిక కార్యకర్త హత్యకు గురయ్యారు. ఆయన భూతగాదాల కారణంగా హత్యకు గురయ్యారని ఆ జిల్లా ఎస్పీ కిరణ్ ఖారే వెల్లడించారు. ఇక మంగళవారం దుబాయ్‌లో సినీ నిర్మాత కేదార్ మరణించారు. పెళ్లి వేడుక కోసం దుబాయ్ వెళ్లిన ఆయన రాత్రి పూట నిద్రలోనే గుండెపోటుతో మరణించారు. ఈ విధంగా ఇద్దరు గుండెపోటుతో మరణిస్తే.. మరొకరు భూతగాదాల కారణంగా హత్యకు గురయ్యారు. వారి మరణానికి పోలీసులు ఒక కారణం చెప్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఆరోపణలు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎం పదవిలో ఉంటూ సొంత పోలీసులు చెప్పిన మాటల్ని వక్రీకరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ సీఎం రేవంత్‌రెడ్డికి అనుమానం ఉంటే.. సీఎం పదవిలో ఆయనే ఉన్నారు కాబట్టి విచారణకు ఆదేశించొచ్చు కదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విచారణకు ఆదేశించకుండా.. పోలీసులు చెప్పింది నమ్మకుండా.. కేవలం కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికలకు ముందు రోజు మోదీతో ములాఖత్!

- సీఎం రేవంత్.. మోదీని కలవడంలో ఆంతర్యమేమిటి?
- సీఎం-పీఎం అర్జెంటు భేటీపై నెటిజన్ల అనుమానాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఒక్కరోజు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది. ఎన్నికలకు సరిగ్గా ఒక్క రోజు ముందే ఎందుకు కలవాల్సి వచ్చిందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రధాని మోదీ సైతం అంత తొందరగా అపాయింట్‌మెంట్ ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. సీఎంకు అర్జెంటుగా కలవాల్సిన అవసరం కూడా లేదు.. రేవంత్‌రెడ్డి ఇచ్చిన వినతుల్లో అర్జెంటు పనులేవీ లేవు. అయినప్పటికీ గంటల్లోనే అపాయింట్‌మెంట్ ఖరారవ్వడం, కలవడం ఏంటనే చర్చ జరుగుతున్నది. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ తమ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓడినా తమ పార్టీకి వచ్చిన ఇబ్బందేమీ లేదని వ్యాఖ్యానించారు. ఓవైపు అక్కడ సొంత పార్టీ అభ్యర్థి ఓటమిని కోరుకుంటూ మరోవైపు ప్రత్యర్థి పార్టీకి చెందిన, ప్రధాని మోదీని కలవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డికి సొంత పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ లభించడమే గగనమైన పరిస్థితుల్లో గంటల వ్యవధిలో ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ దక్కడంపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో అసలు ఆంతర్యం ఏమిటని నెటిజన్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపీకి మేలు చేకూర్చేలా మోదీతో రేవంత్‌రెడ్డి మాట్లాడుకుని వచ్చారని కొందరు వ్యాఖ్యలు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ఎప్పటికైనా బీజేపీలో చేరడం ఖాయమని, అందుకే తరచుగా మోదీతో మంతనాలు సాగిస్తున్నారని మరికొందరు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. తెలంగాణలో ఎన్డీఏ ప్రభుత్వం నడుస్తున్నదని, చంద్రబాబు ఆశీస్సులతో రేవంత్ యెల్లో కాంగ్రెస్ పాలన సాగిస్తున్నారని కామెంట్స్ పెడుతున్నారు.

మెట్రో రెండోదశకు అనుమతివ్వండి

- ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి
- మూసీ బాగుకు నిధులు ఇవ్వండి
- రీజినల్ రింగ్ రైల్, డైపోర్ట్‌లను కూడా మంజూరు చేయండి
- రాష్ట్రానికి మరో 29 మంది ఐపీఎస్‌లను కేటాయించండి
- ఢిల్లీలో ప్రధాని మోదీకి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వినతిపత్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మెట్రోరైల్ రెండో దశ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధానికి వినతిపత్రం అందించారు. మెట్రో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల పొడవైన ఐదు కారిడార్లను ప్రతిపాదించినట్టు తెలిపారు. ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించి ఉత్తరభాగం నిర్మాణానికి ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తయినందున దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. దక్షిణ భాగం భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున 50 శాతం భరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్రిపుల్ ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని, దీన్ని ఆమోదించాలని కోరారు. డ్రైపోర్ట్‌తోపాటు ఏపీలోని సముద్రపోర్ట్‌లను కలిపేలా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును, రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కోరారు. ఇక మూసీ పునరుజ్జీవానికి సహకరించాలని, ఈ ప్రాజెక్టు కోసం రూ.20 వేల కోట్లు ఆర్థిక సాయం చేయాలని ప్రధానిని కోరారు. అదేవిధంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని విన్నవించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం వల్ల రాష్ట్రానికి అదనంగా 29 ఐపీఎస్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు.

రాష్ట్రంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 35 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బుధవారం భద్రాచలంలో అత్యధికంగా 38.3 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మంచిర్యాల జిల్లా భూసీపేట, ములుగు జిల్లా గోవిందరావుపేట, నిజామాబాద్ జిల్లా మంచిప్పలో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఐదురోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయని తెలిపారు. హైదరాబాద్‌లో 33 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తర, తూర్పు జిల్లాల్లో 35 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని వివరించారు. మార్చి 2 నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని అధికారులు చెప్పారు.

వేటు భయం.. 'ఫొటో' నాటకం!

మొదటిపేజీ తరువాయి...

కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీపై పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మొదట్లో దూకుడుగా వ్యవహరించిన ఈ 10 మంది ఎమ్మెల్యేలు తత్వంబోధపడి రూపాంతరం చెందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతున్నదనే ఆందోళనతో కాస్త పరువు నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారని, కొంతకాలమైనా అనర్హత వేటును వాయిదా వేయించుకునేందుకు, అవకాశం ఉంటే కోర్టును తప్పుదోవ పట్టించేందుకు అనువైన సాకులు వెతుక్కుంటున్నారని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతున్నది. కాంగ్రెస్ కండువాలు ధరించి ఫొటోలు దిగి, కాంగ్రెస్ సమావేశాలకు, ఆఖరికి సీఎల్పీ సమావేశానికి హాజరైన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని సాక్షం కోసం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడం చర్చనీయాంశమైంది. తాను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్టు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలా ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదుచేశారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పేరుతో ఫ్లెక్సీలు వేశారని, ఉద్దేశపూర్వకంగానే తనను అప్రతిష్ఠపాలు చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఈ నెల 11న పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. పార్టీ ఫిరాయింపులపై ఇటీవల న్యాయస్థానాలు చేస్తున్న వ్యాఖ్యలను గమనిస్తుంటే, రాష్ట్రంలో ఉపఎన్నికలు ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ వేగంగా నిర్ణయం తీసుకోకపోవడంపై కోర్టులు కోపంగా ఉన్నాయని న్యాయనిపుణులు చెప్తున్నారు. అటు రాజకీయంగా, ఇటు న్యాయపరంగా జరుగుతున్న పరిణామాలను బట్టి రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఇటీవల భయం మొదలై కొత్తదారులు వెతుక్కుంటున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

బీఆర్ఎస్ న్యాయ పోరాటం

నిరుడు మార్చిలో ఫిరాయింపులపర్వం మొదలైనప్పటి నుంచి పార్టీ ఫిరాయింపుల నిరోధకచట్టం కింద వారిపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో, సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తున్నది. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్లపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సింగిల్‌బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్‌బెంచ్ కొట్టివేసింది. అదే సమయంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను తేల్చాల్సిందేనని స్పీకర్‌కు సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ సుప్రీంకోర్టుకు వెళ్లడంతో కోర్టులో 'సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు' అని స్పీకర్ కార్యాలయం తరపు న్యాయవాది పేర్కొనడంతో ధర్మాసనం ఘాటుగా స్పందించింది. 'ఎంతకాలం? మహారాష్ట్రలో పార్టీ ఫిరాయింపుల మాదిరిగా చేస్తారా?' అంటూ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. నోటీసులు ఇవ్వడానికే పది నెలల సమయం తీసుకుంటారా? అని నిలదీసింది. రెండు వారాల గడువు ఇస్తే వివరాలు కనుక్కొని చెప్తానని ప్రభుత్వం తరుపున న్యాయవాది అభ్యర్థించగా, 'తెలుసుకొని చెప్పడానికి హైదరాబాద్ వెళ్లక్కర్లేదు. ఫోన్‌లో మాట్లాడి కూడా చెప్పవచ్చు' అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది. గతంలో సుప్రీంకోర్టు తీర్పులు, 10 మంది ఎమ్మెల్యేల అనర్హత విషయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలను పరిశీలిస్తే, మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిందేనని నిపుణులు చెప్తున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో గుబులు

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో ఇప్పటికే గుబులు మొదలైందని జరుగుతున్న పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. పార్టీ మారడంపై ప్రజలు తిరగబడే పరిస్థితి నెలకొన్నదని, అందుకే ఫిరాయింపు ఎమ్మెల్యేలు నానా తంటాలు పడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'ఎన్నికలు వస్తే ఓటమి తప్పదేమో.. అన్నింటికీ సిద్ధపడదాం' అని తమ సన్నిహితులకు సంకేతాలు ఇస్తున్నట్టు ఆయా నియోజకవర్గాల్లో చర్చ సాగుతున్నది.

వేటు తప్పదనే ఎమ్మెల్యేల 'ఫొటో' నాటకం

ఫిరాయింపు ఎమ్మెల్యేలు తమపై వేటు తప్పదనే భయంతోనే నానా సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. ఉపఎన్నికలు రావడం ఖాయమని గ్రహించి అందుకు అనువైన ఎజెండాను రూపొందించుకుంటున్నారు. తాము పేదల పక్షపాతి అని, కేసీఆర్ ఆశీస్సులు తమకే ఉన్నాయని ఇప్పటినుంచే చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాము పార్టీ మారలేదని నమ్మబలుకుతున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఫ్లెక్సీల్లో తమ ఫొటోలు పెట్టుకుంటున్నారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ మారిన పలువురు ఎమ్మెల్యేలు ఇటీవలి కాలంలో